క్లుప్తంగా

జల్‌జీవన్ మిషన్‌పై పల్స్ సర్వే



పడమర ఖండ్రికలో నివాసితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి సదుపాయం కల్పించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ పల్స్ సర్వే చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై పడమర ఖండ్రికలోని సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి తాగునీటి సదుపాయాల లభ్యతపై సర్వే చేశారు. విషయాలను సంబంధిత అధికారులకు నివేదించారు.

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి



లాయర్ జొన్నపల్లి

మండపేట: మండపేట, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఏర్పాటు చేయాలని ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జొన్నపల్లి సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సైధిల్‌పేట వీధిలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో గన్నవరం, మండపేటలలో కొత్తగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఆవశ్యకత ఉందన్నారు. అలాగే ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులు కూడా లేవన్నారు. 2009లో ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఆయా ప్రాంతాల ప్రజలు కోర్టుకు వెళ్లాలంటే 20 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. మండపేటలో కోర్టు ఏర్పాటు చేస్తే మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గన్నవరంలో కోర్టు ఏర్పాటు వల్ల గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడి కుదురు మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

సంచార జాతులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

మండపేట: సంచార జాతుల వివరాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సర్కూర్మా వెంకటరెడ్డి నాయుడు సామాజిక అభివృద్ధి విషయాల అధ్యయన సంస్థ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది టీవీ గోవిందరావు కోరారు. సంచార జాతులను గుర్తించి, వారికి కూడా సాధారణ పౌరులు మాదిరిగానే అన్ని గుర్తింపు కార్డులు, సౌకర్యాలు, వసతి హక్కులు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పుడే దేశ పౌరులు అందరికీ సమాన న్యాయం చేసినట్టు అవుతుందనీ మండపేటలో ఆయన శనివారం పేర్కొన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలోని సంచార జాతులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేసిన ప్రభుత్వం సంచార, అర్ధసంచార, విముక్తి జాతుల జనాభాను గతంలో ఎలా లెక్కించారో వెల్లడించాలని కోరారు. రాష్ట్రంలో సంచార, అర్ధ సంచార విముక్త కులాలు మొత్తం 42 ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తమ కంటూ ఒక స్థిర నివాసం లేని ఈ కులాలు రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల్లోనూ వలసలుగా బతుకు తెరువు కోసం తరలివెళ్లి తమ జీవనాన్ని సాగిస్తున్నాయన్నారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యం: వేర్వేరు కేసుల నమోదు

పి.గన్నవరం: మండలంలో వేర్వేరుగా ఇద్దరు వ్యక్తులు ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనలపై పి.గన్నవరం పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. బెల్లంపూడి గ్రామానికి చెందిన 46 ఏళ్ల ఆదిమూలం సూరిబాబు పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 8న పాత ఇనుము వ్యాపారం నిమిత్తం రాజోలు ప్రాంతం వైపు వెళ్లాడు. అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాలు గాలించారు. అయినప్పటికీ అతడి ఆచూకీ తెలియక పోవడంతో మేనల్లుడు వెంకట సాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. అలాగే ఎల్.గన్నవరం గ్రామానికి చెందిన పెదపూడి దుర్గా ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య ఇటీవల మనస్పర్థలు ఏర్పడ్డాయని ఏఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు. దీంతో ఇటీవల భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అతడు ఉత్తరం రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. దుర్గా ప్రసాద్ తల్లి అనంతకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వివరించారు.

రెండు బైక్‌ల ఢీ: ముగ్గురికి గాయాలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిరేవు వద్ద శనివారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. సఖినేటిపల్లిరేవు వద్ద నుంచి యాక్టీవా బైక్‌పై మలికిపురం వైపునకు కేశనపల్లికి చెందిన ప్రదీప్, మలికిపురానికి చెందిన బాలు వస్తున్నారు. ఇదే మార్గంలో అదే సమయంలో సఖినేటిపల్లి జయపేట నుంచి ఫ్యాషన్ బైక్‌పై మరో మధ్య వయస్సు వ్యక్తి వెళుతున్నాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మొత్తం ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని తొలుత ఆటోలో మలికిపురం కేర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకై రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మొదలైన ఎలక్కొట్టుడు

- వరి దుబ్బు తీపెక్కడంతో పంటను కొరికేస్తున్నాయి
- పుట్టిన ఐదు వారాలకే ఎలుకలకు సంతాన యోగం
- బ్రోమోడయోలిన్ మందు పంపిణీ కోసం రైతుల ఎదురుచూపు



పొగబెట్టే విధానంలో ఎలుకలు పడుతున్న వ్యక్తి



పొలంలో బుట్టలు పెట్టేందుకు వెళ్తున్న ఎలుకలు పట్టే వ్యక్తి

రాయవరం: ఖరీఫ్ సానుకూలంగా ఉంటుందనుకున్న తరుణంలో పెరుగుతున్న ఉక్కపోత వాతావరణంతో వరి పంటను అక్కడక్కడా మొవ్వ కుళ్లు తెగులు ఆశిస్తోంది. మరోపక్క రైతులు కలుపు తీతల హడావుడిలో ఉండగా, ఎలుకలు వరి పంటను నష్టపరిచే పనిలో పడ్డాయి. వరిపై ఎలుకలు చేస్తున్న దాడి రైతన్నకు మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయి. పురుగులు.. తెగుళ్ల దాడి, కలుపు తీతలకు కూలీల ఖర్చుతో పాటు రైతులు ఎలుకల నివారణకు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఎలక్కొట్టుడు వల్ల కూడా పెట్టుబడి పెరగడం రైతన్నను ఆర్థికంగా కుంగదీస్తోంది.

1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు

రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగును చేపట్టినట్టు వ్యవసాయ శాఖ లెక్కల ద్వారా తెలుస్తోంది. ఈ ఖరీఫ్‌లో స్వర్ణ రకాన్ని 85 శాతం, ఎంటీయు 1318 రకం 10 శాతం, మిగిలిన ఐదు శాతం రబీలో విత్తనాలను సిద్ధం చేసుకోవడంలో భాగంగా ఎంటీయూ 3626 (బొండాలు), ఎంటీయూ 1112, 1064, 1269. బీపీటీ 5204 తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు.

ఎలక్కొట్టుడు

వరి పంట ప్రస్తుతం పిలక దశలో ఉంది. పిలక దశ అనంతరం చిరుపొట్ట దశకు చేరుకుంటుంది. సాధారణంగా చిరుపొట్ట దశలో దుబ్బు తీపెక్కడంతో ఎలుక్కొట్టుడు అధికంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం పిలక దశలోనే ఎలక్కొట్టుడు అధికంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. రైతులు ఎలుకల నివారణ చర్యలు చేపడుతున్నారు. ఎలుకల వలన ఎకరాకు దాదాపుగా రెండు నుంచి మూడు బస్తాల పంట నష్టం వాటిల్లుతున్నట్టు రైతులు వాపోతున్నారు.

ఎలుకకు రూ.50

ఎలుకల మందు ఖరీదు కాదు కాని, వాటి నివారణ ఖరీదుగా మారడానికి కారణం ఎలుకకు ఉన్న తెలివితేటలే. ఎలుకలు మందు వాసనను, ఎరలను పసిగట్టి ఆ ప్రదేశానికి ఆమడ దూరానికి వెళ్లిపోతాయి. రైతులంతా ఒకేసారి మందు ప్రయోగిస్తే కాని చంపడం సాధ్యం కాదు. ప్రభుత్వం కూడా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడానికి కారణం అదే. దీంతో రైతులు ఎలుకలు పట్టే వేటగాళ్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ఎలుకను పట్టి చంపినందుకు నిన్నమొన్నటి వరకు రూ.50 ఉండగా, దీన్ని ఇప్పుడు రూ.60కు పెంచారు. ఎలుక కన్నంలో పొగపెట్టడం ద్వారా కొందరు, మరికొందరు బుట్టలు పెట్టి ఎలుకలను పడుతున్నారు. ఎకరానికి ఏడెనిమిది ఎలుకల వరకూ పడుతున్నాయి. మరికొందరు రైతులు ఎలుకల పట్టే వారికి పంటకు ఎకరాకు రూ.రెండు వేల వరకూ చెల్లిస్తున్నారు. ఇందుకుగాను పలువురు రైతులు ఎలుకల పట్టే వారికి గ్రామాల్లో ఆశ్రయం కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎందుకింత నష్టం అంటే..

ఎలుక పళ్లు రోజుకు 0.3 మిల్లీమీటర్లు పెరుగుతాయి. వాటిని అరగదీసుకోక పోతే కొద్ది రోజుల్లో అవి చనిపోతాయి. అందువల్ల రోజులో ఎక్కువ భాగం ఏదో ఒకదాన్ని కొరుకుతూనే గడుపుతాయి. పంటలకు ఎలుక కలిగించే నష్టానికీ, దాని పరిమాణానికి అసలు సంబంధం ఉండదు. వాటి జీవిత కాలం రెండేళ్లు. ఒక ఆడ ఎలుక పుట్టిన ఐదు వారాలకే పిల్లలను కనే శక్తి సంతరించుకుంటుంది. ఒక కాన్పులో సగటున ఏడు పిల్లలు పుడతాయి. పేరుకే ఎలుక కాని అది ఏనుగు తిండి తిన్నంతగా నష్టం చేకూరుస్తుంది.

బ్రోమోడయలిన్ మందు పంపిణీ ఎప్పుడో?

అదను దాటాక పదును వేసిన చందాన ఎలుకల నివారణ ఎప్పుడూ ఆలస్యంగా చేపడుతున్నారు. సాధారణంగా వరినాట్లు వేసిన వెంటనే సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయినా ఏటా బ్రోమోడయలిన్ మందు సరఫరాలో జాప్యం చోటు చేసుకుంటుంది. ఈ ఏడాది కూడా ఇప్పటికింకా బ్రోమోడయలిన్ మందును సరఫరా చేయక పోవడంతో ఎలుకల ఉధృతి పెరుగుతోందని రైతులు చెబుతున్నారు.

ఎలుకల దాడి ప్రారంభమైంది



పంట చేలల్లో ఎలుకల దాడి ప్రారంభమైంది. ఎలక్కొట్టుడు వలన ఎకరానికి ఒక కుంచెడు నేలలో పొలానికి నష్టం చేకూరుతుంది. అందుకే పొగపెట్టి ఎలుకల పట్టే వారిని ఆశ్రయిస్తున్నాం. ఎలుకల ఉధృతి పెరగడంతో ఎలుకకు రూ.60లు ఖర్చవుతోంది.

– కొవ్వూరి వెంకటరెడ్డి (ఎర్ర శ్రీను), కౌలు రైతు, పసలపూడి, రాయవరం మండలం

ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి



వరి పిలక దశలో ఉంది. ఎలుకలు వరి పంటను నష్టపరుస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎలుకలను సామూహికంగా నివారించేందుకు బ్రోమోడయలిన్ మందు సరఫరాకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. ప్రతి రైతుసేవా కేంద్రం పరిధిలో త్వరలోనే ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందును సరఫరా చేయనున్నాం.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం

టీచర్లు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి



రాయవరం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రామలక్ష్మణమూర్తి

రాయవరం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని, అందుకే ప్రతి నెలా విద్యాశాఖ ఈ సమావేశాలు నిర్వహిస్తోందని మండల విద్యాశాఖాధికారులు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పేర్కొన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. సమావేశంలో ఎంఈవోలు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాలను పెంచుకునే దిశగా ప్రయత్నించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు అర్థవంతమైన చర్చలు చేపట్టాలన్నారు. సమావేశంలో రాయవరం, పసలపూడి కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్ ఆధారంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం వీఎస్ సునీత, సెక్రటరీ పి.విజయకుమార్ పాల్గొన్నారు.

శునకాల నివారణకు చర్యలు తీసుకోవాలి

మండపేట: పట్టణంలో కుక్కల సంచారం విపరీతంగా పెరిగిపోయినందున, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక టౌన్ హాల్ వద్ద గల తన కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. పట్టణంలో పెరిగిన కుక్కల సంతతి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు కుక్కలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారని ఆయన గుర్తు చేశారు. కానీ నేటికీ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరం అన్నారు. కుక్కలను ఏదైనా దూర ప్రాంతాలకు తరలిస్తే బాగుంటుందన్నారు. లేదా ఖాళీ ప్రదేశంలో చుట్టూ కంచె వేసి అందులో ఉంచి మున్సిపాలిటీ పోషించాలని సూచించారు.

ప్రకృతి శక్తులతో అవగాహనతో మెలగాలి

- యోగా గురువు అల్లూరి శ్రీనివాస చౌదరి
- అంగర హోమియో వైద్య శిబిరంలో 110 మందికి సేవలు



అంగరలో వైద్య సలహాలను ఇస్తున్న శ్రీనివాస చౌదరి

కపిలేశ్వరపురం: మానవాళి మనుగడకు జీవనాధారమైన ప్రకృతి శక్తులతో ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని మానవత సంస్థ ప్రతినిధి, యోగా గురువు అల్లూరి శ్రీనివాస చౌదరి అన్నారు. విశ్వమానవతా సంస్థ ఆధ్వర్యంలో అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం మానవతా ఆరోగ్య వైద్యం, యోగ థెరపీ, హోమియోపతి చికిత్సలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ ఆరోగ్య జీవన విధానం, నిత్యా యోగ సాధన ద్వారా శాస్త్రీయ పద్ధతిలో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. భారతదేశంతో పాటు ఇంగ్లాండ్, అమెరికా వంటి దేశాల్లో యోగా ప్రాధాన్యతపై ప్రసంగాలు చేస్తున్న అల్లూరి శ్రీనివాస చౌదరి సేవలను గ్రామ ప్రముఖులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో కీళ్లనొప్పులు, మధుమేహం, బీపీ, ఆస్తమా, ఫిట్స్, పక్షవాతం, క్యాన్సర్, స్త్రీలవ్యాధులతో బాధపడుతున్న 110 మందిని పరీక్షించి హోమియోపతి వైద్యులు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామారావురావు, మానవతా సంస్థ వలంటీర్లు సేవలందించారు.

భీమేశ్వరాలయంలో ఆభరణాల తనిఖీ



భీమేశ్వరాలయంలో ఆభరణాలు తనిఖీ చేస్తున్న వెంకట దుర్గాభవాని

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఫిర్యాదు మేరకు జరుగుతున్న విచారణలో భాగంగా శనివారం దేవాదాయ శాఖ ఆభరణాల తనిఖీ అధికారి ఎ. వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలన చేసి ఆభరణాల తూకాలను సరి చూసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

వెదురుపాక పీఠంలో లక్ష్మీనరసింహస్వామి, సత్యదేవ కల్యాణాలు



పీఠంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి పంచద్రవ్యాలతో అభిషేకాలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో కనుల విందుగా లక్ష్మీనరసింహస్వామి, సత్యదేవ కల్యాణాలు శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. విజయదుర్గా పీఠం 52వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈ వేడుకలు జరిగాయి. అహోబిలం నుంచి తీసుకుని వచ్చిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, అన్నవరం రమా సత్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. తొలుత వేద పండితులు సుదర్శన చక్రం, లక్ష్మీనరసింహస్వామికి పంచద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పీఠంలో కొలువైన విజయ దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) తన ప్రసంగాల్లో లక్ష్మీనరసింహస్వామి, సత్యదేవుని కల్యాణ విశిష్టతను వివరించారు. లోక కల్యాణార్థం పీఠంలో కల్యాణాలు నిర్వహిస్తున్నామన్నారు. వార్షికోత్సవాలకు హాజరైన భక్తులకు పీఠంలో అన్న సమారాధన చేశారు. వార్షికోత్సవాల్లో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనలతో రోడ్డెక్కిన వైద్య సిబ్బంది

- కోల్‌కతాలో మెడికోపై అత్యాచారంతో పెల్లుబికిన ఆగ్రహం
- పలుచోట్ల వైద్యులు, సిబ్బంది మానవహారం



గొల్లపాలెం పీహెచ్‌సీ వద్ద నిరసనలు తెలుపుతున్న ఆరోగ్య శాఖ సిబ్బంది



ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారంగా వైద్యులు, సిబ్బంది

కాజులూరు: కోల్‌కతాలోని వైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా జూనియర్ వైద్యురాలిపై జరిగిన పాశవిక అత్యాచారాన్ని నిరశిస్తూ కాజులూరు మండల గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిరశనలు వ్యక్తం చేశారు. గొల్లపాలెంలో స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎస్.సౌజన్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆందోళనలు చేపట్టి 'బతికించే డాక్టర్లను బలితీసుకోవద్దంటూ' ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రాణం పోసే డాక్టర్లకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వైద్యుల పట్ల తప్పుడుగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. మండలంలోని దుగ్గుదుర్రు పీహెచ్‌సీలోనూ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించి నిరసనలు తెలిపారు. పలు ప్రధాన కూడళ్లిలో ప్లకార్డులతో వైద్యులకు రక్షణ కల్పించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించారు.

ద్రాక్షారామలో మానవహారం

రామచంద్రపురం రూరల్: ఇటీవల కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్రైనీ వైద్యురాలిని అత్యంత పాశవికంగా పొట్టనపెట్టుకున్న దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్ వద్ద ద్రాక్షారామ, కుందూరు, దంగేరు, పామర్రు, వెల్ల, పేకేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం మానవహారం నిర్వహించారు. ముందుగా వారు ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వారిని తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేస్తూ కె.గంగవరం, ద్రాక్షారామల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ టీఎస్ఎస్ సందీప్‌నాయుడు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ జాయ్ కేథరిన్, డాక్టర్ అమని, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని పామర్రు, పేకేరు, దంగేరు, కుందూరు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సిబ్బంది, వైద్యులు శనివారం విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులు, నినాదాలతో ధర్నా నిర్వహించి ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్, తహసీల్దార్ సూర్యారావులకు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కోటిపల్లి-కాకినాడ ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. కుందూరు పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.ప్రతాప్ మాట్లాడుతూ కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన దాడి, హత్య దారుణమన్నారు. బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని వైద్యులకు, వైద్య సిబ్బంది రక్షణ కల్పించాలని కోరారు.

రామచంద్రపురం: కోల్‌కతాలోని వైద్యురాలి హత్యను ఖండిస్తూ పట్టణంలోని వైద్యులు శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న కమలా నర్సింగ్ హోం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని సమ్మె చేశారు. దీంతో పట్టణంలోని పలు ఆసుపత్రుల్లో సేవలు నిలిచిపోయాయి. జూనియర్ డాక్టర్ హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వైద్యులు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

జూనియర్ డాక్టర్ మృతిపై గళమెత్తిన డాక్టర్లు

కపిలేశ్వరపురం: కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ వైద్యశాలలో ట్రెయినీ మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ కపిలేశ్వరపురం మండలంలోని ప్రభుత్వ వైద్యులు, ఆశ, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు శనివారం నిరసన తెలిపారు. ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్, ఏపీ ఎంఎల్‌హెచ్‌పీ అసోసియేషన్, ఏపీ స్టాఫ్ నర్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కపిలేశ్వరపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి వైద్యురాలి ఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న వైద్యులకు రక్షణ లేకపోవడం దిగజారిన లా అండ్ ఆర్డర్ స్థితిగతులను తెలియజేస్తుందంటూ వాకతిప్ప, అచ్యుతాపురం, అంగర పీహెచ్‌సీలు, కపిలేశ్వరపురం సీహెచ్‌సీల వైద్యాధికారులు కరుణేంద్రకుమారి, పి.చంద్రమౌళి, సీహెచ్.రాకేష్ చౌదరి, రాజ్‌కుమార్, విజయదీపిక, పి.రత్నకుమారి అన్నారు. రాజ్యాంగ పరిధిలోని వ్యవస్థలన్నీ వైద్యశాలల్లోని పని ప్రదేశాల్లో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బందికి రక్షణ కల్పించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత వైద్యురాలి కుటుంబానికి తగిన న్యాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, శ్రీధర్, హెల్త్ విజిటర్లు, ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.



కె.గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రామచంద్రపురంలో సమ్మె చేస్తున్న వైద్యులు



కపిలేశ్వరపురంలో నిరసన ర్యాలీలో వైద్యులు